# అధ్యక్షా... 'అభ్యర్థి' తేలేదెప్పుడు..!

**ప్రధాన పార్టీల అభ్యర్థుల ఎంపికలో డోలాయమానం.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కార్యకర్తల అయోమయం**



**జూబ్లీహిల్స్, అక్టోబరు 5, (ప్రభాతవార్త**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అభ్యర్థుల ఎంపిక వ్యవహారం పార్టీ అధిష్ఠానాలకు తలనొప్పిగా మారుతుంది...ఆశావాహుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటంతోపాటు పోటాపోటీ ప్రచారాలు చివరికి సొంత పార్టీలోనే నష్టం కలిగిస్తాయనే అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, బీజెపి అధ్యక్షుడు రాంచందర్‌రావులకు అభ్యర్థుల ఎంపిక వ్యవహారం ఇప్పుడు కొత్త సవాల్‌గా మారింది. ఒకవైపు కమిటీలు వేసి, మరోవైపు సమావేశాలు పెట్టి అభిప్రాయాలు సేకరిస్తున్నా ఏకాభిప్రాయం రావడానికి, అభ్యర్థిని ఎంపిక చేయడానికి ఇంకా సమయం పట్టే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆశావాహులు టిక్కెట్ దక్కించుకోవాలనేందుకు ఇప్పటికే తమకు తెలిసిన నాయకుల వద్దకు చక్కర్లు కొడుతుంటే మరికొందరు నేతలు ఏకంగా ఢిల్లీ కేంద్రంగా తమ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయించుకొనేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

**ప్రచారంలో దూసుకెళ్తున్న బిఆర్ఎస్**

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో ఈ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే తమ పార్టీ అభ్యర్థిగా మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతగోపీనాథ్‌ను ప్రకటించింది. దీంతో ఆమె తన ప్రచారాన్ని ముమ్మరం చేశారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లను పర్యటిస్తూ ప్రచారానికి పదును పెడుతున్నారు. మరోవైపు కేటీఆర్, హరీష్‌రావు తదితర నేతలు సైతం ఆమెకు మద్దతుగా ఇప్పటికే ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. పండుగల నేపథ్యంలో మాగంటి సునీత వివిధ కార్యక్రమాలను ఏర్పాటుచేసి నియోజకవర్గ ప్రజలను ఆమె నేరుగా కలిశారు. వారి మద్దతును కోరారు. ఆమెతోపాటు ఆమె కుమార్తెలు సైతం ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

**డోలాయమానం..**

అధికార పార్టీలో అభ్యర్థి విషయంలో ఇంకా డోలాయమాన పరిస్థితి నెలకొని ఉంది. ఇక్కడి నుంచి అభ్యర్థుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటం అటు అధిష్ఠానానికి సైతం ఇబ్బందిగా మారుతుంది. కాంగ్రెస్ నేతలు అంజన్‌కుమార్ యాదవ్, బొంతు రామ్మోహన్ పేర్లు ప్రధానంగా వినిపించగా వీరితోపాటు స్థానిక కాంగ్రెస్ నేతలైన నవీన్‌యాదవ్, రహ్మత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి.అయితే అంజన్‌కుమార్‌యాదవ్‌కు ఎంపీగా చేసిన అనుభవంతోపాటు బొంతు రామ్మోహన్ నగర మేయర్‌గా చేసిన అనుభవం ఉంది. దీనికితోడు ఇద్దరు బీసీ నేతలు కావడం వారికి కలిసొచ్చే అంశంగా కనిపిస్తుంది. ఇదే స్థానం నుంచి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి పేర్లతోపాటు ప్రస్తుత ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్లు సైతం తెరమీదకు వచ్చాయి. దానం నాగేందర్ రాజీనామా చేసి బరిలోకి దిగుతాడనే ప్రచారం జరుగగా అదేమి లేదంటూ దానం ఇప్పటికే ఖండించారు. వీరితోపాటు మరి కొందరు కాంగ్రెస్ నేతలు సైతం తాము బరిలో ఉన్నామంటూ కార్యక్రమాలు చేపడుతున్నారు. దీనిపై ఇప్పటికే రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్ సైతం సమీక్ష నిర్వహిస్తున్నారు. ఆశావాహుల పేర్లను ఢిల్లీకి పంపేందుకు సిద్ధమవుతున్నారు.

**కమలంలోనూ అదే గుబులు..**

బీజెపి అభ్యర్థి వ్యవహారంలోనూ ఇంకా మీమాంస కొనసాగుతూనే ఉంది. బీజేపీకి కొత్త అధ్యక్షుడు వచ్చినప్పటికి అభ్యర్థి నిర్ణయమనేది తేలకపోవడం పార్టీలోనూ అయోమయానికి గురిచేస్తుంది. గతంలో జిల్లా అధ్యక్షుడిగా ఉన్న గౌతంరావు సీటు కేటాయింపు విషయంలో ఆయనకే అధ్యక్ష పదవి అడ్డుగా వచ్చింది. ఇప్పుడు జిల్లా అధ్యక్షుడిగా లంకల దీపక్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. ఆయన జూబ్లీహిల్స్ రేసులో ప్రధానంగా ఉండటంతో గౌతంరావుకు వర్తించిన షరతునే వర్తిస్తారా లేక కొత్త అభ్యర్థిని నిర్ణయిస్తారా అనేది తెలియాల్సి ఉందని పార్టీ వర్గాల్లోనే చర్చ జరుగుతుంది. ఈ క్రమంలోనే పార్టీకి చెందిన జూటూరు కీర్తిరెడ్డి, వీరపనేని పద్మ, మాజీ కార్పొరేటర్ కిలారు మనోహర్, ఆకుల విజయ, ఆలపాటి లక్ష్మీనారాయణ తదితర నేతలు బరిలో ఉన్నామంటూ పార్టీకి తెల్పుతున్నారు. బీజేపీ నుంచి లంకల దీపక్‌రెడ్డి గత ఎన్నికల్లో పోటీచేయగా దాదాపు పాతికవేలకు పైగా ఓట్లు వచ్చాయి. 14.11 ఓటు శాతంతో మొత్తం లక్షా 83 వేలకు పైగా ఓట్లుపోలయ్యాయి. ఈ క్రమంలోనే బీజేపీలో అభ్యర్థి ఎంపికకు త్రిసభ్య కమిటీ వేసి క్షేత్రస్థాయిలో అభ్యర్థులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. జూబ్లీహిల్స్ టిక్కెట్ వ్యవహారం ఢిల్లీలో తేల్చాల్సి ఉండటంతో మరింత సమయం పట్టే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.



హైదరాబాద్ వార్త

# పుట్టగొడుగుల్లా వెలుస్తున్న షెడ్లు

* నేతల పేర్లు చెబుతూ దర్జాగా నిర్మాణాలు
* సర్కిల్ కమిషనర్ మారినా మారని తీరు
* ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
* అధికారుల తీరు పై తీవ్ర ఆరోపణలు
* కొనసాగుతున్న వసూళ్ల పర్వం



**అత్తాపూర్ అక్టోబరు 5, ప్రభాతవార్త :** క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమంగా నిర్మిస్తున్న వారి నుంచి అందిన కాడికి దండుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అక్రమ నిర్మాణదారులు నేతలు, ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి అడ్డగోలుగా నిర్మాణాలు చేపడుతున్నా అడిగే వారు కరువయ్యారు. అక్రమ నిర్మాణాల ద్వారా ప్రతినెల లక్షల రూపాయలు తమ జేబుల్లోకి వేసుకుంటున్నారు. జిహెచ్ఎంసి అధికారుల సహకారం లేనిదే ఇది సాధ్యం కాదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తన హయాంలో భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడిన గత డిప్యూటీ కమిషనర్ రవికుమార్ మారినా అదే తీరు కొనసాగటం గమనార్హం. కొన్ని రోజుల క్రితం బాధ్యతలు చేపట్టిన సురేందర్‌రెడ్డి సమర్థవంతంగా విధులు నిర్వహిస్తారని జనం అంతా అనుకున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. అంతా నేతలు వ్యవహారాలు చక్క దిద్దుతున్నారు. వారికి అధికారులు లాలూచీ పడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. నేతలు, అక్రమ నిర్మాణదారులు నుంచి అందినకాడికి దండుకుంటున్నారనే విమర్శలు సర్వత్రా వినిపి స్తున్నాయి.

**అక్రమాలకు అడ్డాగా :**

మైలార్దేవుపల్లి డివిజన్ పరిధిలోని ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీలో నిబంధనల ప్రకారం కేవలం రెసిడెన్షియల్ నిర్మాణాలు మాత్రమే చేపట్టాలి. అయితే ఇక్కడ అక్రమార్కులు ఆడిందే ఆట పాడిందిపాటగా వ్యవహారం జరుగుతుంది. దానికి జిహెచ్ఎంసి సర్కిల్ అధికారులు అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందిరాగాంధీ సొసైటీ బైలాస్‌కు వ్యతిరేకంగా నిర్మాణాలు చేపడుతున్న కూడా అడిగేనాథుడు లేకుండా పోయాడని ధ్వజమెత్తుతున్నారు. ఇక్కడ 90 శాతం ప్లాట్లలో అక్రమ నిర్మాణాలు, అనుమతులు లేకుండా షెడ్లు, కమర్షియల్ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ నిర్మాణం జిహెచ్ఎంసి అధికారులకు, ప్రజాప్రతినిధులకు కల్పతరువుగా మారింది అనే విమర్శలు లేకపోలేదు. అందిన కాడికి వారు దండుకుంటున్నారు.

**నేతల పేరు చెబుతూ...**

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్దేవపల్లి డివిజన్ ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీలో కొందరు ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పుకుంటూ నిర్మాణదారులు అడ్డగోలుగా అక్రమ షెడ్లు నిర్మిస్తున్నారు. మాకు ఓ ప్రజాప్రతినిధి పర్మిషన్లు ఇచ్చాడని అంటున్నారు. తాము నిర్మాణాలు చేపడుతున్నట్లు యజమాని పేర్కొనడం గమనార్హం. మున్సిపల్‌లో షెడ్ల నిర్మాణాలకు పర్మిషన్లు తీసుకోవాల్సి ఉండగా అవేవి తీసుకోకుండా ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పుకుంటూ అడ్డగోలుగా నిర్మాణాలు సాగిస్తుండడంతో పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి.

**కమిషనర్ మారిన మారని తీరు...**

ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీలో అక్రమ షెడ్ల నిర్మాణాలపై గత డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ నిర్మాణదారులకు అంతర్గతంగా సహకారం అందిస్తూ తూతూ మంత్రంగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొన్నారని, తద్వారా ఒక్కో నిర్మాణదారుడు నుంచి లక్షల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ విషయంలో నూతన డిప్యూటీ కమిషనర్ సురేందర్‌రెడ్డి వచ్చాక తీరు మారుతుందని అందరూ భావించారు. కానీ పరిస్థితిలో ఏమాత్రం మార్పు కనిపించడం లేదు. కమిషనర్ సురేందర్ రెడ్డి హయాంలోనూ అదే వ్యవహారం జరుగుతోంది. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అక్రమ నిర్మాణాలపై ఉక్కు పాదం మోపాల్సిన జీహెచ్ఎంసి అధికారులు అందినకాడికి దండుకుంటున్నారు. తూ.. తూ మంత్రంగా నోటీసులు జారీ చేస్తూ.. దానిని బూచిగా చూపిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. ఎవరైనా స్థానికులు ఫిర్యాదులు చేస్తే నామమాత్రంగా నోటీసులు ఇచ్చి చేతులు దులిపేసుకుంటున్నారు.

**అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం**

**రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసిపి శ్రీధర్**

ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఎసిపి శ్రీధర్ అన్నారు. నోటీసులు ఇచ్చి కూల్చివేస్తామని టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ పేర్కొన్నారు. పర్మిషన్లు తీసుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# అమ్మవారి విగ్రహాల నిమజ్జనం





**హైదరాబాద్, అక్టోబరు 5 ప్రభాతవార్త:** దసరా నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో నగరంలో అమ్మవారి విగ్రహాల నిమజ్జనం కొనసాగింది. తొమ్మిది రోజులు పూజలు అందుకున్న అమ్మవారి విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించిన అనంతరం ఆదివారం ట్యాంక్‌బండ్ వద్దకు నిర్వాహకులు తీసుకొచ్చారు. దీంతో ఎటు చూసినా సందడి వాతావరణం నెలకొంది.

# కార్మికుల హక్కుల రక్షణకు బలమైన పోరాటాలు నిర్మించాలి

**హైదరాబాద్, అక్టోబరు 5 ప్రభాతవార్త**

దేశంలోని కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్రంలోని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభు త్వం అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ గ్రూపు లకు అనుకూలంగా తీసుకువచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలనీ ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు డా.జి.సంజీవరెడ్డి అన్నారు.ఆదివారం బర్కత్‌పురలోని డా.జి.సంజీవరెడ్డి నివాసంలో పలువురు ఐఎన్‌టియూసి నాయకులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి, దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు,హెచ్ఏండబ్ల్యూఎస్ ఎస్.బి ట్రేడ్ యూనియన్స్ జేఏసీ చైర్మన్ మొగుళ్ళ రాజిరెడ్డి నేతృత్వంలో నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు టిజెఈయు ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రరాజ్, అల్లి శ్రవాన్ కుమార్, ఎండీ జాంగిర్, ఈ.చంద్రశేఖర్, రమణారెడ్డి, బి.దేవేం దర్, ఎం.రాజా, కె.ఆనంద్ రెడ్డి, ఎం.రాంచేందర్, బి.శంకర్‌ప్రకాష్, హాసిం, సి.రాజు, శ్రీనివాస్ యాదవ్, వినోద్‌గౌడ్, గౌస్ పాషా, మొగుళయ్య, రంగయ్య, యాదయ్యగౌడ్ సంజీవ రెడ్డిని కలిసి అభినందనలు తెలిపినవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ కార్మికుల ప్రయోజనాలను, హక్కుల రక్షణకై అప్పటి కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ బలమైన పోరాటాలు నిర్మించాలని పిలుపు నిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక ఆర్థిక విధానాలు, కార్మిక వ్యతిరేక విధానాల వల్ల ఉద్యోగుల వేతనాలు తగ్గుతున్నాయని, పని గంటలు పెరుగుతున్నాయని, కానీ కార్పొరేట్ల లాభం అంతులేకుండా పెరుగుతోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాజీలేని ఉద్యమాలు చేస్తూ కార్మికుల ప్రయోజనాలను కాపాడే బాధ్యత ఐఎన్‌టియుసి దేనని అయన చెప్పారు. జలమండలిలో ఇటీవల జరుగుతున్నటువంటి పరిణామాలు, గుర్తింపు సంఘం ఎన్నికలు, దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న అనేక కార్మికుల సమస్యలను సంజీవ రెడ్డి దృష్టికి మొగుళ్ళ రాజిరెడ్డి తీసుకెళ్లారు. జలమండలి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

**ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు సంజీవరెడ్డి**



సంజీవరెడ్డిని సన్మానిస్తున్న మొగుళ్ళ రాజిరెడ్డి, బొంతు రామ్మోహన్

## మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి**

**యూసుఫ్‌గూడ, అక్టోబరు 5, ప్రభాతవార్త :** మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అట్లూరి లక్ష్మన్‌కుమార్ అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని రహమత్‌నగర్ డివిజన్ హబీబ్ ఫాతిమానగర్ కమ్యూనిటీ హాల్‌లో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ముస్లింల గ్రేవియార్డు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ విషయాన్ని గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఏమాత్రం స్పందన లేదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బోరబండ ఎర్రగడ్డ రహ్మత్‌నగర్ యూసుఫ్‌గూడడివిజన్‌లకు చెందిన పలు మజీదుల పెద్దలు ఓ కమిటిని ఏర్పాటు చేసుకుని స్థలం విషయమై అందరి మంత్రులను కలవడం జరి గింది. ఈ రాబోయే ఉపన్నికల్లో తమకు గ్రేవియార్డు స్థలం కేటియించిన వారికే తమ ఓటు అంటూ తెగేసి చెప్పారు. దీనితో మంత్రులు వెంటనే స్పందించి స్థలాలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్‌కు మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌లకు సూచించగా వారు షేక్‌పేట్ ప్రాంతంలో వక్‌బోర్డుకు సంబందించి ఒక ఎకరం 5కుంటల స్థలాన్ని గుర్తించారు.దానిలోనుంచి 2500గజాల స్థలాన్ని కేటాయించడంతోపాటు ప్రహరీ నిర్మించడం వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసేందుకు జీవో తీసుకురావడం జరిగిందని మంత్రులు తెలిపారు. దీంతో నియోజకవర్గంలోని మైనార్టీలు హర్షం వ్యక్తం చేశారు. మంత్రుల చేతుల మీదుగా గ్రేవియార్డు స్థలం కేటాయిస్తున్నట్లు తగిన పత్రాలను కమిటిసభ్యులకు అందజేశారు. ఈకార్యక్రమంలో వక్‌బోర్డు చైర్మన్ అజ్మేతుల్ల హుస్సేని, ఎంపీ అనీల్‌కుమార్ యాదవ్, టిపిసిసి అడ్వైజర్ ఎమ్‌డీ షరీఫ్ ఆలీ,మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్ వైస్ చైర్మన్ మహ్మద్ ఫహీమ్ ఖురేషి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యేలు నవీన్‌యాదవ్, హాజారుద్దీన్, రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సిఎన్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎర్రగడ్డలోని సబ్‌రిజిష్టర్ ఆఫీస్ పక్కన తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజి గర్ల్(సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్)ను ప్రారంభించారు.



మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, లక్ష్మణ్ కుమార్



సుల్తాన్‌పూర్ శ్రీనివాస్‌రెడ్డి నివాసంలోని కొబ్బరి చెట్టు దగ్ధమవుతున్న దృశ్యం

### హైదరాబాద్ నగర శివార్లలో

# రైతు నివాసంలో పిడుగు

**కొబ్బరి చెట్టు దగ్ధం.. భయాందోళనలకు గురైన గ్రామస్తులు**

**ప్రాణ, ఆస్తి నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్న స్థానికులు**

**సరూర్‌నగర్, అక్టోబర్ 5 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలోని కేంద్ర రక్షణ పరిశోధన సంస్థ ఆర్‌సిఐ సమీపంలోనున్న సుల్తాన్‌పూర్ గ్రామంలో పిడుగు పడింది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2.30 గంటల సమయంలో స్థానిక సుల్తాన్‌పూర్ రైతు, బాలాపూర్ బండ్లగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ అన్ను శ్రీనివాస్‌రెడ్డి నివాసంలోని కొబ్బరి చెట్టుపై భారీ శబ్ధంతో పిడుగు పడడంతో ఊరంతా ఉలిక్కిపడింది. ఆకాశం పూర్తిగా మేఘావృతమై వర్షం కురుస్తున్న సమయంలో మెరుపులు, మేఘాల గర్జనల మధ్య ఒక్కసారిగా దద్ధరిల్లేలా భారీ శబ్ధంతో ఊర్లో పిడుగు పడడంతో గాఢ నిద్రలో ఉన్న గ్రామస్తులంతా తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. అయితే పిడుగు ధాటికి కొబ్బరి చెట్టుకు మంటలు అంటుకొని కాలిపోతున్న సమయంలో తేరుకున్న రైతు అన్ను శ్రీనివాస్‌రెడ్డి చెట్టుపైకి నీళ్లు చల్లి మంటలనార్పారు. అయితే పిడుగు పాటుకు ఆస్తినష్టంగా గానీ ప్రాణనష్టం గానీ జరగకపోవడంతో గ్రామస్తులంతా ఊపిరి పీల్చుకున్నారు.



స్థంభం ఎక్కిన వ్యక్తిని అదుపులో తీసుకెళ్తున్న పోలీసులు

## కరెంట్ స్తంభం ఎక్కి వ్యక్తి హల్ చల్

**అత్తాపూర్ అక్టోబరు 5, ప్రభాతవార్త :** ఓ వ్యక్తి కరెంట్ స్తంభం ఎక్కి హల్చల్ చేసిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీసుస్టేషన్ ఎదుట జరిగింది. ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి పోలీసుస్టేషన్ ఎదుట ఉన్న కరెంట్ స్తంభం పైకి బాంబే కాలనీకి చెందిన ఇంజమూరు వేణు ఎక్కి జై తెలంగాణ, పోలీసు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ హంగామా సృష్టించాడు. దీంతో దుర్గానగర్ నుండి చాంద్రాయణగుట్ట వెళ్లే రూట్‌లో ట్రాఫిక్ జాం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎసిపి శ్రీనివాస్ ఘటన స్థలానికి చేరుకొని డిఆర్ఎఫ్, పోలీసు సిబ్బంది సహాయంతో క్షేమంగా అతడిని కిందకి దింపి ఆస్పత్రికి తరలించారు. ఎసిపి శ్రీనివాస్ 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ... బాంబే కాలనీకి చెందిన వేణును పక్కనే ఉండే మల్లా రెడ్డి, శిరీషలు కొట్టారని పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చాడని, అదేవిధంగా వారు రూ.1500 ఇవ్వాలని, అవి ఇప్పించాలని పోలీసులను కోరగా వారు కూర్చోమని చెప్పారని అతను వినకుండా స్టేషన్ ఎదుట ఉన్న కరెంట్ స్థంబాన్ని ఎక్కి హంగామా సృష్టించాడని పేర్కొన్నారు. అతడిని కిందకి దింపి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని అతని మానసిక స్థితిపై విచారణ చేస్తామని పేర్కొన్నారు.

## అప్పు విషయంలో ఘర్షణ..కత్తితో దాడి

**సైదాబాద్, అక్టోబరు 5 ప్రభాతవార్త:** అప్పు విషయంలో ఒక వ్యక్తిపై కత్తితో దాడికి పాల్పడిన సంఘటన కాంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కమల్ కుమార్ కథనం వివరాలు... హాఫీజ్‌బాబా నగర్‌కు చెందిన షేక్‌సైఫ్(25), అహ్మద్‌బిన్ అబ్దుల్లా బావజీర్ మధ్య శనివారం రూ.30 వేల హ్యాండ్‌లోన్ విషయంలో గొడవ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన అహ్మద్‌బిన్ బావజీర్ వెంట తెచ్చుకున్న కత్తితో షేక్‌సైఫ్ మెడమీద, భుజాలపైన దాడిచేసి అక్కడ నుంచి పరారయ్యాడు. గాయాలకు గురైన సైఫ్‌ను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## ఒఆర్ఆర్‌పై వరసగా ఢీకొన్న కార్లు.. తప్పిన ప్రమాదం

**అత్తాపూర్ అక్టోబరు 5, ప్రభాతవార్త :** ఒఆర్ఆర్‌పై వరుసగా కార్లు ఢీకొన్న సంఘటన రాజేంద్రనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...ఒఆర్ఆర్ ఎగ్జిట్ నెంబర్ 17 వద్ద 7,8 కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయని రాజేంద్రనగర్ టోల్‌గేట్ నుంచి తెలంగాణ పోలీసు అకాడమీకి వెళ్లే మార్గంలో కార్లు ఒకదానికొకటి ఢీకొనడంతో పాక్షికంగా ధ్వంసమయ్యాయాని ఎయిర్ బెలూన్ ఓపెన్ అవ్వడంతో ప్రమాదం తప్పిందని అంతా క్షేమంగా ఉన్నారని తెలిపారు..భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడడంతో స్పందించిన పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్‌చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ఓఆర్ఆర్‌పై వరసగా ఢీకొన్న కార్లు

# దసరా రిటర్న్ జర్నీ

**హైవేలపై వాహనాల రద్దీ..కిలకిటలాడుతున్న రైళ్లు, బస్సులు**

**హైదరాబాద్, అక్టోబరు 5 ప్రభాతవార్త:**

దసరా సెలవులు ముగియంతో గ్రామాల నుంచి ప్రజలు హైదరాబాద్ నగరానికి తిరిగివస్తున్నారు. ఉద్యోగులకు దసరా సెలవులతో పాటు వీకెండ్ కూడా కలిసి వచ్చింది. ఆదివారం నగరానికి చేరు కుని సోమవారం ఆఫీసులకు వెళ్లాలనే ఆలోచన లతో అందరూ ఒకేసారి నగరానికి తిరుగు పయనమయ్యారు. దీంతో దసరా రిటర్న్ జర్నీతో నగరంవైపు వాహనాలు బారులుతీరాయి. కార్లు, ఆర్టీసి బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలు ఒకదాని వెంట మరొకటి నిలిచిపోయాయి. సొంత వాహనాల్లో జనం పెద్ద సంఖ్యలో నగ రానికి వస్తున్నారు. దీంతో చిట్యాల, చౌటుప్పల్, పంతంగి, బీబీనగర్ గూడురు టోల్ ప్లాజాల వద్ద రద్దీ ఏర్పడింది. మరోవైపు ప్రయాణికులతో బస్సులు కిక్కిరిసిపోయాయి.వరుస సెలవులు రావడంతో చాలా మంది పర్యాటక ప్రాంతాలు, ఆధ్యాత్మిక యాత్రలకు వెళ్లారు. నగరంలో పని చేస్తున్న ఐటీ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం సొంత ఊళ్ల నుంచి నగరానికి చేరుకుంటున్నారు. ఈ ఏడాది దసరా సందర్భంగా ఆర్టీసి సుమారు 7,750 బస్సులను నడిపింది.

**అదనపు రైళ్లు..**

వివిధ ప్రాంతాల నుంచి నగరానికి చేరుకొనే ప్రయాణికుల దృష్ట్యా విశాఖ, విజయవాడ, గుం టూరు, తిరుపతి, బెంగళూరు, పాట్నా తదితర ప్రాంతాల నుంచి అదనపు రైళ్లను ఏర్పాటు చేశారు. పలురైళ్లకు సాధారణ బోగాలను అదనంగా ఏర్పాటు చేశారు. ప్రయాణికుల డిమాండ్ మేరకు రిజర్వేషన్ బెర్తులు లభించకపోవడంతో సాధారణ బోగీల్లో రద్దీ పెరిగింది. మరోవైపు సికింద్రాబాద్, చర్లపల్లి, కాచిగూడ, నాంపల్లి స్టేషన్ల వద్ద రిటర్న్ జర్నీ ప్రయాణికులతో సందడి నెలకొంది. చర్లపల్లి టర్మినల్ నుంచి సరైన సిటీ బస్సుల సదుపాయం లేకపోవడంతో ప్రయాణి కులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు.ఆటోలు, క్యాబ్‌లపై ఆధారపడాల్సిన పరిసిన్థతి నెలకొందని ప్రయాణికులు పేర్కొన్నారు.





విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యేలు

## విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

### ఎమ్మెల్యేలు శ్రీగణేష్, రాజశేఖర్‌రెడ్డి

**కంటోన్మెంట్, అక్టోబరు 5 ప్రభాతవార్త:** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజ నాత్మక శక్తిని వెలికితీసేందుకు క్విజ్ పోటీలు ఎంతగానో దోహదపడ తాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిలు తెలిపారు. సీరత్ ఉన్ నబీ జీవిత చరిత్రపై బొల్లారం మజీద్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల బహుమతుల ప్రధానోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి కాంపిటీషన్ ఎగ్జామ్స్ పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ పోటీల్లో పాల్గొంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ చింతల వేణుగోపాల్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముప్పిడి మధుకర్, సంకి రవిందర్‌బాబు, బద్రినాథ్ యాదవ్, శేఖర్ ముదిరాజ్, నవీన్,మజీద్ కమిటీ సభ్యులు ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దాండియా వేడుకలు



నృత్యాలు చేస్తున్న మహిళలు

**కంటోన్మెంట్, అక్టోబరు 5 ప్రభాతవార్త:** దసరా, బతుకమ్మ, దేవీ శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని శనివారం రాత్రి సికింద్రాబాద్ ఈస్ట్ మారేడ్‌పల్లిలోని డక్కన్ క్లబ్‌లో దాండియా వేడుకలు ఘనంగా జరిగాయి. క్లబ్ కమిటీ సభ్యుల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దాండియా వేడుకల్లో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. ఈ వేడుకల్లో పలువురిని అకట్టుకునే విధంగా ప్రదర్శించిన మహిళలకు క్లబ్ అధ్యక్షులు అర్.ఏ.స్వరూప్,ఉపాధ్యక్షులు పి.విక్రమ్, కార్యదర్శి పుస్తె వసంతు కుమార్, కోశాధికారి వెంకటేశ్ దిండిగల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కమిటీ మెంబర్లు అర్.సప్తగిరి, కె.కొంక కుమార స్వామి, చింతపండు మల్లేశ్, మధు వట్యం,డాక్టర్ నర్సయ్య, పిట్ల నాగేశ్ ముదిరాజ్,గోలి శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన బస్సు చార్జీలను ఉపసంహరించుకోవాలి

### టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా



మాట్లాడుతున్న టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా

**ముషీరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:**నగరంలో పెంచిన సిటీ బస్సు ఛార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. ఆదివారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బస్సు రూట్లలో స్టేజీల వారీగా ఐదు నుంచి పది రూపాయల వరకు టిక్కెట్ ధరలను పెంచుతూ, పెంచిన ధరలు సోమవారం నుంచి అమలులోకి వస్తాయని టీఎస్ఆర్టీసీ ప్రకటించటం సామాన్యుడి నడ్డి విరిచే విధంగా ఉందని విమర్శించారు. చార్జీల పెంపుతో బస్ పాసులు, డే పాస్‌లతో ప్రయాణాలు చేసే విద్యార్థులపై, చిరు ఉద్యోగులపై అదనపు భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అధిక ధరలతో నలిగి పోతున్న ప్రజలకు దసరా కానుకగా బస్సు చార్జీలు పెంచటం మంచిది కాదన్నారు. ప్రజల నుంచి తిరుగుబాటు రాకముందే పెంచిన బస్సు చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ సీటు యాదవులకే కేటాయించాలి



వట్టె జానకయ్య యాదవ్‌ను సత్కరిస్తున్న సమితి నాయకులు

**సైఫాబాద్, అక్టోబరు 5 ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ యాదవులకే సీటు కేటాయించాలని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మేకల రాములు కాంగ్రెస్ పార్టీ అధిష్టాన వర్గాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సమితి ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టిఆర్‌పి ప్రధాన కార్యదర్శి వట్టె జానకయ్య యాదవ్‌ను సమితి ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మేకల రాములుయాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యాదవ కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసి, 100 కోట్లు నిధులు కేటాయించాలని కోరారు. రాష్ట్ర జనాభాలో 18 శాతం ఉన్న యాదవులకు నామినేటెడ్ పదవుల్లో 3 ఎమ్మెల్సీలు, చైర్మన్ పదవులు, డైరెక్టర్లు ఇవ్వాలని ఆయన కోరారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని, లేని పక్షంలో యాదవుల సత్తా ఎంటో ప్రభుత్వానికి తెలియజేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ సంఘం నాయకులు దేవేందర్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, సింహాయాదవ్, నక్కా శ్రీనివాస్‌యాదవ్, మల్లేష్‌యాదవ్, వినోద్‌యాదవ్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు సనత్‌నగర్ నియోజకవర్గంలో

### రక్తదాన శిబిరాలు, సామాజిక సేవలు : తలసాని

**అడ్డగుట్ట, అక్టోబరు 5 ప్రభాతవార్త:** సనత్ నగర్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. సోమవారం జరగనున్న తన పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, అన్నదానాలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందు తున్న రోగులకు, వృద్ధాశ్రమాలు, అనాధాశ్రమాల్లో ఉంటున్న వారికి అన్న దాన కార్యక్రమాలు, పండ్ల పంపిణీ చేపట్టాలని కార్యకర్తలకు సూచించారు.

# మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్

**జూబ్లీహిల్స్, అక్టోబరు 5, ప్రభాతవార్త :** మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని కేబీఆర్ జాతీయ ఉద్యానవనం వద్ద 'స్టాప్ సబ్స్టెన్స్ అబ్యూస్' పేరుతో రన్‌ను నిర్వహించారు. ఈ రన్‌ను ప్రారంభించిన మంత్రి మాట్లాడుతూ.. యువతలో ఇటీవల మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతుందని, ఇది అతిపెద్ద ముప్పని అన్నారు. విద్యార్థుల ప్రతిభను ఈ అలవాటు నాశనం చేస్తుందన్నారు. ప్రతి యువకుడు తనతోపాటు తన చుట్టూ ఉన్న వారిని మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు ప్రయత్నించాలని అన్నారు. కార్యక్రమంలో అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఆసుపత్రి డీన్ డాక్టర్ కె. మనోహర్, సీఓఓ అపర్ణారెడ్డి, పలువురు వైద్యుల తోపాటు అపోలో వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. కేబీఆర్ ఉద్యానవనం నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు జరిగిన రన్‌లో వారంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. అక్కడి నుంచి తిరిగి రన్ కేబీఆర్ ఉద్యానవనాన్ని చేరుకొంది.




కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్



పేదలకు ఆహారపదార్థాలను పంపిణీ చేస్తున్న విద్యాసంస్థల ప్రతినిధులు

## తెలంగాణ ఉద్యమవీరుడు గుడిసెల వెంకటస్వామి

**చిక్కడపల్లి, అక్టోబరు 5 ప్రభాతవార్త:** మాజీ కేంద్ర మంత్రి జి.వెంకటస్వామి అందరికీ స్ఫూర్తి ప్రధాత అని పలువురు ప్రముఖులు కీర్తించారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల ఆవరణంలో ఆ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు స్వర్గీయ గడ్డం వెంకటస్వామి 96వ జయంతి కార్యక్రమం జరిగింది. అంబేద్కర్ విదాసంస్థల నుంచి ట్యాంక్‌బండ్ వరకఉ వంద లాది విద్యార్థినీ విద్యార్థులు, విద్యాసంస్థలకు చెందిన ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, 5కెరన్ నిర్వహించారు. తెలంగాణ చూసిన తరువాతనే నా మరణం అని స్ఫూర్తి కలిగించి పోరాటం చేసిన వ్యక్తి మాజీ కేంద్ర మంత్రి జి.వెంకటస్వామి అని అన్నారు. ఆయన నిరాడంబరత పేదల పట్ల వారికి ఉన్న కృషి నేటి తరం వారు నేర్చుకోవాల్సిన అవసరం ఉందని, ఆయన నేటి యువత రాజకీయాలకు ఒక ఐకాన్ అని అన్నారు. చరిత్రలో రాజకీయాల్లో కేంద్రస్థాయి లో కింది నుంచి ఆ స్థాయి వరకు ఎదగవచ్చు అని నిరూపించిన వ్యక్తి వెంకటస్వామి అని అన్నారు. దాదాపు రెండువేల మందికి అన్నదానం చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడుగా, తెలంగాణ ఉద్యమవీరుడుగా వెంకటస్వామి బహుజన ఆత్మగౌరవ ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, కరస్పాండెంట్ డాక్టర్ సరోజా, కార్యదర్శి, ఎమ్మెల్యే జి.వినోద్, విద్యాసంస్థల కార్యదర్శి జి.వినోద్, కళాశాల సీఈవో, డైరెక్టర్‌లు, ప్రిన్సిపాల్స్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## యువత స్వయం ఉపాధితో రాణించాలి

### ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్, అక్టోబరు 5 ప్రభాతవార్త :** యువత స్వయం ఉపాధితో రాణించేందుకు కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం సప్తగిరి హిల్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన లిటిల్ స్టార్ బేబి స్టూడియోను ముఖ్య అతిదిగా హాజరై ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ యువత స్వయం ఉపాధితో రాణించి ఇతరులకు చేయూత అందించాలని సూచించారు. వ్యాపార రంగంలో రాణించేందుకు ౹తన వంతు సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ చిలుకానగర్ డివిజన్ సీనియర్ నేతలు పల్లె నర్సింగ్ రావు, జెల్లి మోహన్, ఈరెల్లి రవీందర్ రెడ్డి,పిట్టల నరేష్, తిరుమలలేశ్, రాజు నిర్వహకులు సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘాన్సీబజార్, రికాబ్‌గంజ్‌లో రోడ్లు అధ్వానం

**చార్మినార్, అక్టోబరు 5 ప్రభాతవార్త :** ఘాన్సీ బజార్, రికాబ్‌గంజ్, కోకరివాడి, బండి అడ్డ, మామాజుమ్లా పాఠక్ ప్రాంతాలలోని రహదారులు చాలా అధ్వాన్న స్థితికి చేరుకున్నాయి.రోడ్ల గుంతలు మయంగా మారటంతో ప్రజలు నా నా అవస్థలు పడుతున్నారు.దీనికి తోడు ఇటీ వల కురిసిన భారీ వర్షాలకు రహదారులు మరింత చెడి పోవటంతో వాహనదారులు,ప్రజలు నరక యాతన అనుభవిస్తున్నారు.చెడి పోయిన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని పలు మార్లు సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నప్పటికి ఎటువంటి ఫలితం లేకపోయింది.బండి అడ్డ నుంచి కోకరివాడి బస్తీకి చేరుకునే ప్రధాన రహదారి శిధిలా వస్థకు చేరుకున్నందున ప్రజలు నడవటానికి కష్టంగా ఉంది. రాత్రి వేళల్లో చీకటిలో పాదచారులు జారి పడి గాయల పాలవుతున్నారు.హైకోర్టు నుంచి ఘాన్సీ బజార్‌లోని వైదిక వచనాలయానికి వెళ్లె రహదారి పూర్తిగా గుంతలు మయంగా మారింది.నిత్యం వందలాది వాహనాలు ఈ రోడ్డులో వెళుతుంటాయి.దాదాపు సంవత్సరం నుంచి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్న అధికారులు పట్టించుకోవటం లేదని ఘాన్సీ బజార్ వాసులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రికాబ్‌గంజ్, కోకరివాడి,మామా జుమ్లా పాఠక్ బస్తీలలో రోడ్డు పాడై పోవటంతో ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గుంతలు మయంగా మారిన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



బండి అడ్డ రహదారి దుస్థితి



బహుమతులు అందిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

## ఉత్తమ బతుకమ్మలకు బహుమతుల ప్రదానం

చిక్కడపల్లి, అక్టోబరు 5 ప్రభాతవార్త: అడిక్‌మెట్ డివిజన్ అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే సద్దుల బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా 'లక్కిడ్రా' కార్యక్రమాన్ని ఆదివారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తీశారు. రామ్‌నగర్ ఈ సేవా వద్ద నిర్వహించిన ఈ లక్కిడ్రాలో ప్రథమ బహుమతిని శ్రీనివాస్ షాపింగ్ మాల్ అధినేత యాదగిరి ఇచ్చిన పట్టుచీరను స్వామికి ఎమ్మెల్యే ముఠాగోపాల్ అందించారు. ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు మొత్తం పదహారు బహుమతులను ఈ సందర్భంగా మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహ, బిఆర్ఎస్ నేతలు నేతా శ్రీనివాస్, కొండపల్లి మాధవ్, కె.సురేందర్, టక్కర్ శ్రీనివాస్, మున్న, సత్యనారాయణ సాయిప్రసన్న, కె.అనూరాధ, సునంద, తార, విజయ, ప్రియాంక, శైలజ, గురుదీప్‌సింగ్, అస్లామ్, బాలరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయ్ యాదవ్, కరణం సురేశ్, కిరణ్, బిజెపి నేతలు రాగటి నరేశ్, అడిక్‌మెట్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ ౹పాల్గొన్నారు.

## వడ్డెరలకు ఎంపిటిసి, జెడ్‌పిటిసి, సర్పంచ్‌లకు టికెట్లు ఇవ్వాలి

### -తెలంగాణ వడ్డెర సంఘం, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్



మాట్లాడుతున్న శివరాత్రి అయిలమల్లు

**చిక్కడపల్లి, అక్టోబరు 5 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ముప్పై లక్షల మంది జనాభా కలిగి ఉన్న వడ్డెరలకు ఎంపిటీసీ, జెడ్‌పిటిసి, సర్పంచ్‌లకు టికెట్లు ఇవ్వాలని తెలంగాణ వడ్డెర సంఘం, చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర చైర్మన్ శివరాత్రి అయిలమల్లు డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ వడ్డెర సంఘం, చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వరికుప్పల వెంకటేశ్ ఆధ్వర్యంలో సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు, చైర్మన్ శివరాత్రి అయిలమల్లు హాజరై ప్రసంగించారు. ఒక వేల టికెట్లు ఇవ్వని పక్షంలో త్వరలో జరగబోయే జుబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా వడ్డెర సామాజికవర్గానికి చెందిన అభ్యర్థిని నిలబెట్టి ఐక్యత, సత్తా చాటుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంట్రాక్ట్ అంసోసియేషన్ అధ్యక్షుడిగా దేరంగుల రామచందర్ రావును నియమించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి గుర్రం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు శివరాత్రి భిక్షం, సూర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు

**ఉప్పల్, అక్టోబరు 5 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో సారీస్ అఫ్ ఇండియా ప్రదర్శన సందర్భంగా ఆదివారం సముద్రాల మాధవి రామానుజం శిష్య బృందం ఆధ్వర్యంలో భరతనాట్య ప్రదర్శన ఆహుతులను ఎంతగానో అలరించింది. ఈ సందర్భంగా పుష్పాంజలి, అలరింపు, మూషిక వాహన, శివస్తుతి, అన్నమాచార్య కీర్తన, మురుగన్, నవరసహీల, జతిస్వరం, భైరవి శతకం, ఆధ్యాత్మ రామాయణ కీర్తన, అర్ధనారీశ్వర స్తోత్రం తదితర అంశాలను కళాకారులు అడవిత, అక్షయ, చిన్మయి, అనన్య, జ్యోతి నిహిత, నిత్యా, సుముఖి, హాన్వి, వర్షిణి, యశస్వినీ, తన్మయి, సంజన, ఆఘ్న్యా, హంసిని, స్వాతి రితిక, యాత్విక, సాత్విక,తదితరులు ప్రదర్శించి మెప్పించారు. ఆది వారం సెలవు కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వహకులు తెలిపారు.




భరత నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు దృశ్యం

## ఘనంగా వయోధికుల దినోత్సవ వేడుకలు

**ముషీరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320ఏ, 320డి, సీనియర్ సిటిజన్స్ ఫోరం, గాంధీనగర్‌ల సయుక్త ఆధ్వర్యంలో 22వ ప్రపంచ వయోధికుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం దోమల గూడలోని ఏవి కళాశాలలో జరిగిన ఈ వేడుకలను స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా యశోదా హాస్పటల్స్, హైటెక్‌సిటీ వారిచే వయోవృద్ధుల కోసం మెగా ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. మహిళలు బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం బ్రిస్క్ వాకింగ్, లెమన్ అండ్ స్పూన్ వంటి ట్రాక్ గేమ్స్, క్రియేటివ్ గేమ్స్ సింగిల్, కపుల్, మ్యూజికల్ ఛైర్స్ వంటి టీమ్ గేమ్‌లతో కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ముఠా గోపాల్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌కి నూతన ఉత్సాహాన్ని ఇచ్చి, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపటమే కాకుండా వారు మరింత ఆనందంగా, ఆరోగ్యంగా ఉండేందుకు ఇటు వంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ లయన్ డాక్టర్ జి.బాబురావు, లయన్ ఆవుల గోపాల రావు, లయన్ దీపక్ భట్టాచార్జీ, లయన్ టి.రాజేంద్ర ప్రసాద్, లయన్ దేవేందర్ జావర్, లయన్ సూర్య ప్రకాష్, లయన్ జి.రమణ, డాక్టర్ దేవేందర్ భండారి, లయన్ తాళ్ల అంజయ్య, లయన్ బి.ఆర్.రామ్‌రెడ్డి, ఎం.విజయ లక్ష్మి, డి.నర్సింహరాజు, ఓబుల్‌రెడ్డి, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.




వయోధికుల దినోత్సవ వేడుకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

## సిటీబస్సు చార్జీలు పెంచడం అన్యాయం

### బీఆర్ఎస్ నేత రవీందర్‌యాదవ్

**శేరిలింగంపల్లి, అక్టోబరు 5 ప్రభాతవార్త :** జంట నగరాల్లో సిటీబస్సు కనీస చార్జీలను పెంచటం అన్యాయమని బీఆర్ఎస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ సీనియర్ నేత రవీందర్‌యాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పెంచిన బస్సు చార్జీల పెంపు నిర్ణయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ వెంటనే వెనక్కు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హాయంలో పేదలకు సంక్షేమ ఫలాలు అందించటంతో పాటు పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా పనిచేయటం జరిగింద న్నారు. కాంగ్రెస్ సర్కార్ బస్సు చార్జీల పెంపు దుర్మార్గమైన నిర్ణయమని, పేద, బడుగు, మధ్యతరగతి ప్రయాణీకుల జేబులను కొల్లగొట్టేందుకు రేవంత్ ప్రభుత్వ పన్నిన కుట్రని ఆయన విమర్శించారు. ప్రతి ప్రయాణికుడిపై నలకు కనీసం 500 అదనపు భారం మోపటం అన్యాయమన్నారు. బడుగు జీవులు, దినసరి కూలీలు ఎలా బతకాలని ఆయన ముఖ్యమం త్రిని ప్రశ్నించారు. ఇప్పటికే విద్యార్థుల బస్‌పాస్ చార్జీలు,టీ 24 టిక్కెట్ చార్జీలను పెంచింది చాలదన్నట్లు ఇప్పుడు కనీస చార్జీలపై కనికరం లేకుండా 50 శాతం దరలను పెంచటం కాంగ్రెస్ సర్కార్ అసమర్థ, అప్రజాస్వామిక విధానాలకు నిదర్శనమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి సర్కార్ చేస్తున్న మోసపూరిత విధానాలపై బీఆర్ఎస్ పోరాటానికి సిద్దంగా ఉందన్నారు. రానున్న ప్రతి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్‌గా కొన్ని సైదులు

**జూబ్లీహిల్స్, అక్టోబరు 5, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరెడ్డి కర్నాటీ పశ్చిమ మండల టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గోషమహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వరిస్తున్న కొన్ని సైదులు జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ ఆదేశాలిచ్చారు. వీరితోపాటు హైదరాబాద్ ఎస్బీ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న మద్దికుంట వరప్రసాద్ సౌత్‌వెస్ట్ జోన్ పీసీఆర్‌కు, కార్ఖానా డిఐగా ఉన్న రాజశేఖర్ గోషమహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పశ్చిమ మండల టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న చీర్ల యాదేందర్ హైదరాబాద్ ఎస్బీ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. వీరంతా ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. నగర పోలీసు కమిషనర్‌గా సజ్జనార్ బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిగా జరిగిన బదిలీలు ఇవే కావడం విశేషం.

## నేడు ప్రభుత్వ పాఠశాల భవనం ప్రారంభం




ఎర్రమంజిల్‌లో ప్రారంభోత్సవానికి సిద్ధమైన ప్రభుత్వ పాఠశాల

**జూబ్లీహిల్స్, అక్టోబరు 5, ప్రభాతవార్త :** ఖైరతాబాద్ నియోజకవర్గం లోని ఎర్రమంజిల్‌లో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని సోమవారం(నేడు) ప్రారంభించనున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ భవనాన్ని ప్రారంభించేందుకు అవసరమైన సన్నాహాలు చేశారు. నిమ్స్‌కు సంబంధించిన స్థలంలో గతంలో ఈ పాఠశాల కొనసాగేది. కాగా నిమ్స్ విస్తరణలో భాగంగా ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి సైతం నూతన భవనాలను నిర్మించేందుకు ఎంఈఐఎల్ ముందుకొచ్చింది. 40 గదులతో రెండంతస్థుల్లో నిర్మాణాలను పూర్తిచేసింది. మంత్రితోపాటు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి. విజయారెడ్డి, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, ఎంఈఐఎల్ ప్రాజెక్ట్స్ విభాగం అధ్యక్షులు కె. గోవర్ధన్‌రెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ బాలబొమ్మ నాగేంద్రబాబు తదితరులు వీటిని ప్రారంభించనున్నారు. ఉపాధ్యాయులకు అవసరమైన గదులతోపాటు గ్రంధాలయం, ప్రయోగశాల ఉండేలా నిర్మాణాలను తీర్చిదిద్దారు. ఈ పాఠశాలలో అదనంగా భవిష్యత్తులో మరో రెండు అంతస్థులు నిర్మించుకొనేందుకు అవసరమైన డిజైన్‌ను రూపొందించారు. ఇదే ప్రాంతంలో కొనసాగుతున్న రవీంద్రనికేతన్ ఎయిడెడ్ పాఠశాలకు సైతం నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం 200ల మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలలో విద్యార్థులు పెరిగినా అందుకు అనుగుణంగా పాఠశాల అంతస్థులు పెంచుకొనే విధంగా డిజైన్‌ను రూపొందించారు. నిర్మాణ దశలో ఉన్న దీనిని సైతం త్వరలో ప్రారంభించనున్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండి

**చార్మినార్, అక్టోబరు 5 ప్రభాతవార్త :** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఓల్డ్ సిటీ చర్చెస్ కన్వీనర్ బుర్రగళ్ల అనందం అన్నారు.ప్రభుత్వం ద్వారా కుట్టు మిషన్లు లబ్ధిపొందిన పాతబస్తీలోని పలు ప్రాంతాలకు చెందిన లబ్దిదారులతో కలిసి ఆయన రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఏహెచ్ఎన్ క్రాంతి వెస్లీని శాలువ కప్పి సన్మానించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ జూనియర్ అకౌంటెంట్ అరుణ,ఓల్డ్ సిటీ చర్చెస్ కన్వీనర్ బుర్రగళ్ల అనందం,క్రైసవ నాయకులు లాజర్,రవి కుమార్,కుట్టు మిషన్లు అందుకున్న లబ్దిదారులు ఎస్తేర్ రాణి, మంజుల పద్మ,సోనీ,ఎస్తేర్ పాల్గొన్నారు.


జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్, బెంచ్-II వారి సమక్షంలో
హైదరాబాద్ వద్ద
సిపి(ఐబి) నెం. 326/95/హెచ్‌డిబి/2021
లో
ఐఎ. నెం. 1007/2025
లో
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
వర్సెస్
కీ.శే. శ్రీ కె.దయాకర్‌రెడ్డి

ఇన్‌సాల్వెన్సీ మరియు బ్యాంక్రప్టసి (కార్పొరేట్ డెబ్టార్‌నకు వ్యక్తిగత గ్యారంటార్ల కొరకు బ్యాంక్రప్టసి ప్రక్రియ కొరకు తీర్పు చెప్పు ప్రాధికారతకు దరఖాస్తు) రూల్స్, 2019 యొక్క రూల్ 7తో చదువుకొనే ఇన్‌సాల్వెన్సీ మరియు బ్యాంక్రప్టసి కోడ్ 2016 యొక్క సెక్షన్ 121, 123 మరియు 123(5) క్రింద మెస్సర్స్ కెఆర్ఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క వ్యక్తిగత గ్యారంటార్ అనగా కీ.శే. శ్రీ కె. దయాకర్ రెడ్డి (ప్రతివాది నెం.1/వ్యక్తిగత గ్యారంటార్) అతను చట్టబద్ద వారసులు అనగా శ్రీమతి సీతా దయాకర్‌రెడ్డి (ప్రతివాది నెం.1), శ్రీ కార్తీక్‌రెడ్డి (ప్రతివాది నెం.2), శ్రీ సిద్ధార్థ్ రెడ్డి (ప్రతివాది నెం.3) చే ప్రాతినిధ్యం వహించబడుచున్నది వారిపై ఐ.ఎ. నెం. 1007 ఆఫ్ 2025 ను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫైలు చేసినదని దయచేసి గమనించవలెను.

ఇంకనూ తెలియజేయునది ఏమనగా పైన తెల్పిన విషయంలో విచారణ యొక్క తదుపరి తేదీని తెలియజేస్తూ వార్తా పత్రికలలో ఈ నోటీసు ప్రచురించవలసినదిగా ఫైనాన్షియల్ క్రెడిటార్‌కు గౌరవనీయ జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్, బెంచ్-II వారు ఆదేశించినారు. తదనుగుణంగా శ్రీమతి సీతా దయాకర్‌రెడ్డి (ప్రతివాది నెం.1) తండ్రి కీ.శే. కె. దయాకర్ రెడ్డి, శ్రీ కార్తీక్‌రెడ్డి (ప్రతివాది నెం.2) తండ్రి కీ.శే. కె. దయాకర్ రెడ్డి మరియు శ్రీ సిద్ధార్థ్ రెడ్డి (ప్రతివాది నెం.3) తండ్రి కీ.శే. కె. దయాకర్ రెడ్డి, నివాసం: ప్లాట్ నెం. 270 ఎఫ్, రోడ్డు నెం.10, జూబ్లీహిల్స్, హైదరాబాద్, తెలంగాణ-500033 వారికి ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా ఈ విషయం ఇప్పుడు 09.10.2025న విచారణకు రానున్నందున గౌరవనీయ జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్ -II వారి సమక్షంలో 09.10.2025న హాజరు కావలసినదిగా మిమ్ములను కోరడమైనది.

సం/-
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొరకు న్యాయవాదులు
G.P. YASH VARDHAN
SRIKANTH GAVVALA
VINEETH NALLAKADI
INDIALAW LLP
Advocates
Mobile – 8985413955



చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అధికారుల దృశ్యం

## కలెక్టరేట్‌లో గడ్డం వెంకటస్వామి (కాకా) జయంతి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 5, ప్రభాతవార్త:** మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో కేంద్ర మాజీ మంత్రి, స్వర్గీయ గడ్డం వెంకటస్వామి (కాక) 96వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆది వారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రాంగణంలో స్వర్గీయ గడ్డం వెంకటస్వామి జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగ నిర్వహిస్తున్న క్రమంలో కలెక్టరేట్‌లో జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గడ్డం వెంకటస్వామి అందించిన సేవలను పలువురు కొనియాడారు. సమాచార పౌర సంబంధాల శాఖ వారి ఆధ్వర్యంలో సాంస్కృతిక శాఖ తెలంగాణ సారధి నుంచి దేవత సుదాకర్, రెవెన్యూ శాఖ నుంచి సంతోష్‌కుమార్, యువజన క్రీడల నుంచి నరసింహ్మారెడ్డి, అటవీశాఖ నుంచి శ్రీనివాస్‌రెడ్డి, తూంకుంట మున్సిపల్ పారిశుద్య కార్మిక సూపర్‌వైజర్ మేడి మహేశ్వరి, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



అలయ్ బలయ్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు

## అట్టహాసంగా ఆలయ్ బలయ్

**శంకర్‌పల్లి, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** సామాజిక సమరసత శంకరపల్లి మండల ఆధ్వర్యంలో ఆదివారం అలయ్ బలయ్ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ మనందరం ఆత్మీయం గా కలవడం ద్వారా మనలో ఐక్యమ త్యం నిర్మాణం అవుతుందన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో మానవ దృక్పథంతో మెలగాల ని ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘు నందన్ రెడ్డి, తాహేర్ ఆలీ, మునీర్ పాషా, రాజశేఖర్ , శ్రీధర్ రెడ్డి,రాములు ,ప్రధానోపాధ్యాయులు గోపాల్, కృష్ణయ్య, లక్ష్మారెడ్డి, జంగయ్య, కరాటే రవీందర్, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, కవ్వగూడెం శ్రీను, పాల్గొన్నారు.

## రోగికి ప్రాథమిక చికిత్స కీలకం

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 5, ప్రభాత వార్త:** అనారోగ్యానికి గురైన వ్యక్తికి ప్రాథమిక చికిత్స అనేది ఎంతో ఉపయోగకరమని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్ అన్నారు. పోచారం మున్సిపల్ ప్రకాశ్‌నగర్ కాలనీలో ఓ క్లినిక్‌కు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ రోగికి ప్రాథమిక చికిత్స అత్యసరమని అన్నారు. కాలనీవాసులకు అందుబాటులో క్లినిక్ ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయ మని అన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో వైద్యులే దేవుళ్లయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సింగిరెడ్డి సాయిరెడ్డి, డాక్టర్ శివకృష్ణ రమేశ్, మల్లేశ్, మహేశ్, సుబ్బారావు పాల్గొన్నారు.



మున్సిపల్ వైస్ చైర్మన్ రెడ్యానాయక్

## ఈ నెలలో జిల్లాలో సదరం క్యాంపులు

### ..మేడ్చల్ జిల్లా డిఆర్‌డిఒ సాంబశివరావు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 5, ప్రభాతవార్త:** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో సదరం వైద్య శిబిరాలు ఈ నెలలో నిర్వహిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా డిఆర్‌డిఓ సాంబశివరావు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా దివ్యాంగుల కోసం ఈ సదరం క్యాంపులను నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ శిబిరాలు జిల్లాలోని మల్కాజ్‌గిరి ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ బోర్డు ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. ఈ శిబిరాలు ఈనెల 7వ తేదీ నుంచి 31వ తేదీ వరకు సదరం క్యాంపులు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ శిబిరాల్లో ప్రధానంగ దివ్యాంగులలో వినికిడి లోపం, చేతులు,కాళ్ల లోపం, చూపులోపం, మానసిక వెనుక బాటు, మానసికంగ అనారోగ్యం ఉన్న వారికి వర్గాల వారీగ ప్రత్యేక సాట్లు కేటాయించబడుతాయని అన్నారు. 11శిబిరాలను నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ నెల 7,14,28తేదీలలో వినికిడి లోపం ఉన్నవారి కోసం, ఈ నెల 9,16,23,30తేదీలలో చేతులు,కాళ్లలోపం, చూపు లోపం ఉన్నవారి కోసం, అదే విధంగా ఈ నెల 10, 17,24,31తేదీలలో మానసిక వెనుకబాటు, మానసిక అనారోగ్యం ఉన్న వారికి శిబిరాలు జరుగుతాయన్నారు. ఈ సదరం శిబిరాలు హాజరు అవుతున్న దివ్యాంగులు తమతో పాటు మీసేవా ద్వారా బుక్ చేసిన సదరం స్లాట్ రశీదు, ఆధార్‌కార్డు జిరాక్స్, ఫోటో, తాజా వైద్య రిపోర్టులు తీసుకరావాలన్నారు. చేతులు, కాళ్ల లోపం ఉన్న వారు గాంధీ లేదా ఉస్మానియా ఆసుపత్రుల నుంచి రిపోర్టులు తీసుకరావాలని, మానసిక వెనుకబాటు,మానసిక అనారోగ్యం ఉన్న వారు ఎర్రగడ్డలోని జాతీయ మానసిక ఆరోగ్య సంస్థ(నిమ్‌హా) నుంచి ఐక్యూ రిపోర్టులు, వినికిడి లోపం ఉన్న వారు కోటి ఈఎన్‌టి, ఎన్ఐహెచ్‌హెచ్ నుంచి బేరా రిపోర్టులు తప్పనిసరిగా తీసుకరావాలన్నారు. ఆయా రోజుల్లో ప్రతి రోజు ఉదయం 10గంటలకు మల్కాజ్‌గిరి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద హాజరు కావాలన్నారు. సదరం స్లాట్లు మీసేవలో అందుబాటులో ఉంటాయని డిఆర్‌డిఓ సాంబశివరావు తెలిపారు.

## అంతిరెడ్డిగూడలో అలుముకున్న విషాదం

### దైవదర్శనం వెలుతూ.. రోడ్డు ప్రమాదం

### ఒకరు మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు

**నందిగామ, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** పండుగ పూట విషాదం నెలకొన్న సంఘటన నందిగామ మండలం అంతిరెడ్డిగూడలో ఆదివారం ఆలస్యంగా వెలుగు చూసింది. మండలంలోని అంతిరెడ్డిగూడ గ్రామానికి చెందిన మేక్కొండ శ్రీను శనివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులతో కలిసి దైవదర్శనార్థం షిఫ్ట్ కార్ లో యాదగిరిగుట్టకు వెళ్తున్నారు. మార్గమధ్యలో ఘట్కేసర్ వద్ద ముందు వెళ్తున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పి ప్రమాదం సంభవించింది.ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న(14) సంవత్సరాల బాలిక తలకు బలమైన గాయం కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం మలక్ పేటయశోద ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలిక మృతి చెందినట్లు విచారం వెలిబుచ్చారు. గాయాల పాలైన వారందరూ బోడుప్పల్ లో ఉన్న శ్రీకర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఏది ఏమైనా పండగ పూట దైవదర్శనార్థం వెళ్తూ రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి చెందడంతో అంతిరెడ్డిగూడెం లో తీవ్ర విషాదం నెలకొంది.

## కొడంగల్ వాసికి యంబీబీఎస్ సీటు

**కొడంగల్ రూరల్, అక్టోబరు 5 (ప్రభాతవార్త):** కొడంగల్ పట్టణానికి చెందిన పృథ్వీరాజ్ కుమారుడు అఖిల్ యాదవ్ యంబీబీఎస్ సీటు సాధించాడు. ఇటీవలే విడుదలైన నీట్ ఫలితాల్లో 469 మార్కులు సాధించాడు. జాతీయ స్థాయిలో నీట్ పరీక్షలో 469 మార్కులు సాధించిన అఖిల్ యాదవ్ కాళోజీ నారాయణరావు యూనివర్సిటీలో ఉచితంగా యంబీబీఎస్ సీటు సాధించాడు. సెకండ్ ఫేజ్ కౌన్సిలింగ్‌లో మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ మెడికల్ కళాశాలలో సీటు రావడంతో జాయిన్ అయ్యాడు. యంబీబీఎస్ సీటు సాధించిన అఖిల్ యాదవ్‌ను పలువురు అభినందించారు.





యంబీబీఎస్ సీటు సాధించిన అఖిల్ యాదవ్

# బస్టాండ్‌లో మురుగునీటి సమస్యకు పరిష్కారం

వార్త ప్రభావం

## నీరు నిల్వఉండకుండా పూడ్చి చదును స్పందించిన మున్సిపల్ అధికారులు

**శామీర్‌పేట, అక్టోబరు 5, ప్రభాతవార్త:** హకీంపేట్ ఆర్టీసి బస్టాండ్ వద్ద మురికినీరు నిల్వ ఉండి దుర్వాసనతో ప్రయాణీకులు నిలబడలేని పరిస్థితి ఉండటంతో ఎట్టకేలకు సంబంధిత అధికారులు,సిబ్బంది స్పందించి మురికినీరు నిల్వ ఉండకుండ భూమిని చదును చేశారు. ఆదివారం వార్తలో "హకీంపేట్ ఆర్టీసి బస్టాండ్ మురికి కూపం" అనే శీర్షిక రావటంతో తూంకుంట మున్సిపల్ అధికారులు,సిబ్బంది స్పందించి వెంటనే మురికి నీరు ఉన్న దాన్ని చదును చేసి మురికినీరు నిల్వ ఉండకుండ చేశారు. అయితే శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలోని హకీంపేట్ బస్టాండ్ వద్ద రాజీవ్‌రహదారి పక్కన మురికికూపం ఉండటంతో మురికి నీరు నిలిచి దుర్వావాసనతో ప్రయాణీకులు నిలబడలేని దుస్థితి ఏర్పడటంతో ఈ సమస్యను 'వార్త' వెలుగులోకి తీసుకరావటంతో మున్సిపల్ అధికారులు, సిబ్బంది స్పందించి తాత్కాలికంగ మాత్రం సమస్యను పరిష్కరించటం జరిగింది. రాజీవ్‌రహదారిన ఉన్న బస్టాండ్ వైపునకు హోటల్స్,రెస్టారెంట్, షాపుల వారి మురికినీరు వదలకుండ రాకుండ ఉండటానికి మున్సిపల్ కమిషనర్, అధికారులు తగు చర్యలు



హకీంపేట్ ఆర్టీసి బస్టాండ్ వద్ద మురికికూపాన్ని తొలగించి మురికినీరు నిల్వకుండ చదును చేసిన మున్సిపల్ అధికారులు,సిబ్బంది దృశ్యం

# శివాలయం పునర్నిర్మాణానికి భూమి పూజ



శివాలయ పునర్నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

### -హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు

**కేశంపేట అక్టోబర్ 5 ప్రభాత వార్త:** కేశంపేట మండల పరిధిలోని కొండా రెడ్డిపల్లి పోమాల్‌పల్లి గ్రామాల పరిధిలో గుట్టపై వెలసిన శివాలయ పునర్నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వరస్వామి దేవాలయ చైర్మన్ కంచుకోట సత్యనారాయణ, కంచుకోట యాదగిరి కుటుంబ సభ్యులు, ఆదివారం భూమి పూజకార్యక్రమాన్నిర్వహించారు .ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన బిఆర్ఎస్ యువ నాయకులు ప్రేమ్ కుమార్ గౌడ్, నల్లవోలు శ్రీనివాస్ రెడ్డి, కొక్కళ్ళ కుమారస్వామి, బాల్ రాజు, ఏర్పుల వేణు, రమేష్, నర్సింహా, ఉడిత్యాల వెంకటేష్, దశరత్ గ్రామస్థులు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ యువ నాయకుడు ప్రేమ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ శివాలయం పునర్నిర్మాణం గ్రామ అభివృద్ధి, ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీక అని భగవంతుని కృపతో ఈ ఆలయం గ్రామానికి శాంతి, సమృద్ధి తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాట్లు ఆయన తెలిపారు.భగవంతుడి ఆశీస్సులతో గ్రామం శాంతి, ఐక్యత, ఆనందాలతో నిండిపోవాలని ఆ శివుడి చల్లని చూపులు ప్రజల అందరిపై ఉండాలని అన్నారు గొప్ప మనసుతో శివాలయ పునర్ నిర్మించేందుకు ముందుకు వచ్చిన కంచుకోట సత్యనారాయణ, యాదగిరి కుటుంబ సభ్యులకు ఆ శివుడి దీవెనలు ఎల్లవేళలా ఉండాలని ప్రేమ్ కుమార్‌గౌడ్ తెలిపారు.

# సేవా తత్పరుడు మోాముల బసప్ప

### నిరుపేద ఇళ్లకు సిమెంట్ బస్తాలు అందజేత

### ఆపదలో తోచిన సాయం చేసే సద్గుణం

**నందిగామ, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** ప్రస్తుత సమాజంలో తాను తన కుటుంబం బాగుండాలని ఆలోచించే వారే ఎక్కువగా కనిపిస్తారు. కానీ ఎన్ని పనులున్నా, సమస్యలు, ఒత్తిడీలు ఎన్ని ఉన్నా సరే తాను తన కుటుంబంతో పాటు సమాజం కూడా బాగుండాలని కోరుకునేవారు చాలా అరుదుగా కనిపిస్తారు. అలా అరుదుగా కనిపించిన వారిలో ఒకరే నందిగామ మండలం చలివేంద్రి గూడ కు చెందిన ప్రముఖ న్యాయవాది, బికే చాంబర్స్ అధినేత, రంగాపూర్ మాజీ ఎంపీటీసీ మోాముల బసప్ప. చలివేంద్రిగుడ గ్రామానికి చెందిన నిరుపేదలకు వడ్డే మహేష్, వడ్డే మల్లేష్ లకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయింది. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఇల్లు కట్టేందుకు వీలు కాలేదు. ఈ విషయం తెలుసుకున్న బసప్ప నిరుపేదలకు సిమెంట్ బస్తాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బసప్ప మాట్లాడుతూ తమ రాజకీయ గురువులైన మాజీ మంత్రి డాక్టర్ పి శంకర్రావు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు,తన ఆత్మీయ మిత్రుడు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆశయాలకు అనుగుణంగా తన తండ్రి జ్ఞాపకార్థం సామాజిక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్వకోలు సుదర్శన్ గౌడ్, నోముల రాజేష్, అంజయ్య, మధు, ధర్మ నాయక్ గ్రామస్తులు పాల్గొన్నారు.



సలివేంద్రిగూడలో నిరుపేదల ఇళ్లకు సిమెంట్ బస్తాలు అందజేస్తున్న బసప్ప

# క్రీడలు ఆరోగ్యంతో పాటు అహ్లాదాన్ని అందిస్తాయి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

**దుద్యాల్, అక్టోబర్ 05, ప్రభాతవార్త:** క్రీడలు ఆరోగ్యంతో పాటు ఆహ్లాదాన్ని అందిస్తాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేర్గు వెంకటయ్య, మండల అధ్యక్షుడు శేఖర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గత 12 రోజులుగా కొనసాగిన దసరా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలలో విజేతగా 11 స్టార్స్ జట్టు నిలిచింది. రన్నరప్ గా హిట్లర్ హిట్టర్స్ జట్లు నిలిచాయి. విన్నర్, రన్నరప్ జట్లకు ప్రైజ్ మనీ తో పాటు షీల్డ్, ఆటగాళ్లకు మెడల్స్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా క్రీడలు ఆడాలన్నారు. సెలవు రోజుల్లో, పండగ సమయాల్లో ఈ విధంగా టోర్నమెంట్లు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ వేణుగోపాల్, శ్రీశైలం గౌడ్, నిర్వాహకులు నరేందర్ గౌడ్, సంతోష్, విష్ణువర్ధన్ క్రీడాకారులు నిసార్, ఫరీద్, కేశవులు, భరత్, అనిల్, శ్రీకాంత్, నరేష్, రాజేష్, భీంశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపిలో భారీ చేరికలు....

**షాబాద్, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్ రత్నం సమక్షంలో పలువురు బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. మండలంలోని మచన్ పల్లీ గ్రామం నుండి వశిష్ట విద్యాసంస్థల చైర్మన్ మ్యాతరి అశోక్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున చేరారు. దాదాపు 150 మంది యువకులు బిజెపి కండువా కప్పుకున్నారు. బిజెపిలో చేరిన వారిలో గడ్డమీది నర్సింలు ,మన్మారి యాదయ్య చెర్ల రాజు బోడ వెంకటయ్య, షాబాద్ సత్యనారాయణ మ్యాతరి స్వామి చెర్ల రాగవేందర్ కూతురు పెద్ద ఆంజనేయులు ,కె సురేష్ కలాల్ దేవేందర్ గౌడ్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు ప్రభాకర్ రెడ్డి, మాణయ్య, కూతురు మహేందర్, రాము, అచ్చిన మల్లేష్, రాజు, వివేక్, నరేష్, శ్రీశైలం, హరికృష్ణ, మల్లేష్, శ్రీకాంత్, శ్రీనివాస్, నవీన్, నందు తదితరులు పాల్గొన్నారు.

బిజెపిలో చేరుతున్న వారికి కండువా వేసి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కె ఎస్ రత్నం



## ప్రజాసేవకై ఎంపీటీసీ బరిలో ఉంటా

### నందిగామ మాజీ సర్పంచ్ వంకాయల రామన్న

**నందిగామ, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** మండలంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల సీనియర్లు ఎంపీటీసీల ఆశావహులు అధిష్టానం వైపు క్యూ కడుతున్నారు. కాగ నందిగామ మండల కేంద్రంలో మాజీ సర్పంచ్, బిఆర్ఎస్ సీనియర్ నేత వంకాయల ర్నారెడ్డి(రామన్న) నందిగామ ఎంపీటీసీ 3 జనరల్ కావడంతో బరిలో ఉంటున్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ స్థానం జనరల్ కేటాయించడంతో తాను ఎంపీటీసీ బరిలో ఉంటున్నానని, పార్టీకి, ప్రజలకు సేవ చేయడానికి తనకు అవకాశం ఇవ్వాలని బిఆర్ఎస్ పెద్దలకు విజ్ఞప్తి చేశారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం



కేశవరం గ్రామానికి చెందిన బాధితులకు సిఎం రిలీఫ్‌ఫండ్ ఆర్థిక సహాయం మంజూరు కావటంతో చెక్కులను అందజేసిన మేడ్చల్ ఎఎంసి చైర్మన్

### ..సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

### ..మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్

**శామీర్‌పేట, అక్టోబరు 5, ప్రభాతవార్త** ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరంలాంటిందని, పేదలకు వైద్య చికిత్సల కోసం ఆర్థిక సహాయం అందిస్తూ సిఎం రేవంత్‌రెడ్డి ఆదుకుంటున్నారని మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మూడుచింతలపల్లి మండలంలోని కేశవరం గ్రామంలో బాధితులు కాసుల మల్లేశ్‌కు 27,500రూపాయల చెక్కు, ఉప్పెన కృష్ణవేణికి 60వేల రూపాయల వైద్య చికిత్సల కోసం ఆర్థిక సహాయం మంజూరు కావటంతో వారికి చెక్కులు ఆయన అందజేశారు. ఈ సందర్భంగ మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్ మాట్లాడుతూ నిరుపేదలకు ఏదైనా జబ్బు వచ్చి ఆసుపత్రిలో వైద్య చికిత్సలు చేసుకున్న తరువాత అయిన ఖర్చు సిఎం రిలీఫ్‌ఫండ్ నుంచి నిధులు సిఎం రేవంత్‌రెడ్డి ఆర్థిక సహాయం మంజూరు చేయటం జరిగిందన్నారు. మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్ సహకారంతో సిఎం రిలీఫ్‌ఫండ్ మంజూరు కావటం జరిగిందని సంతోషకరమని పేదలను ఆదుకోవటానికి కృషి చేస్తున్నారని నర్సింలుయాదవ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను ఆదుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు శేఖర్, మైనార్టీ నాయకులు యూసుఫ్, ఇతర కాంగ్రెస్ నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.



అనుమిత్రను అభినందిస్తున్న ఎస్ జి ఎఫ్ నేతలు

## అదనపు కలెక్టర్‌గా షాద్‌నగర్ అనుమిత్ర

### అనుమిత్ర విజయంపై రంగారెడ్డి జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రటరీ రామచంద్రయ్య సత్కారం

**షాద్‌నగర్, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణానికి చెందిన అడ్వకేట్ అంజయ్య, ప్రభుత్వ ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ దంపతుల కుమార్తె అనుమిత్ర ఇటీవల జరిగిన గ్రూప్-1 పరీక్షల్లో ప్రతిభ కనబరుస్తూ అదనపు కలెక్టర్‌గా నియామకం పొందారు. చిన్ననాటి నుంచే కష్టపడే స్వభావం, పట్టుదల, క్రమశిక్షణతో ముందుకు సాగిన అనుమిత్రం తన కృషి ఫలంగా ఈ స్థాయికి చేరుకున్నారు. ఆమె విజయంతో తల్లిదండ్రులు, బంధుమిత్రులు, ఉపాధ్యాయులు, సహచరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనుమిత్ర లాంటి పట్టుదల గల యువతే సమాజానికి వెలుగు నింపగలరు అంటూ స్థానికులు ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఎస్ జి ఎఫ్ సెక్రటరీ రామచంద్రయ్య వారి కుటుంబ సభ్యులను అనుమిత్రను స్వయంగా కలుసుకుని మర్యాదపూర్వకంగా ఘన సత్కారం చేశారు.కృషి, క్రమశిక్షణ, నిబద్ధత ఉంటే సాధించలేని లక్ష్యం లేదు. అనుమిత్రం విజయగాథ ప్రతి యువతికి స్ఫూర్తి కావాలని ఆయన అన్నారు. అదే సమయంలో ఆయన మాట్లాడుతూ...గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన యువత ఇలా ఉన్నత పదవులను అందుకోవడం గర్వకారణం. సమాజంలో ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను విద్యాపథంలో ప్రోత్సహించాలి. అనుమిత్ర విజయం అందరికీ ఆదర్శం కావాలని పిలుపునిచ్చారు. అనుమిత్రం మాట్లాడుతూ నా విజయంలో తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల దిశానిర్దేశం, నిరంతర శ్రమ కీలకపాత్ర వహించాయి. ఈ ఉద్యోగాన్ని పారదర్శకంగా ప్రజల సేవకు వినియోగిస్తానని తెలిపింది. స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు, స్నేహితులు ఆమెను అభినందిస్తూ, షాద్‌నగర్ యువతలో స్ఫూర్తి నింపిన విజయం అని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో పిడి అబ్దుల్, పిడి బాలయ్య, రమేష్ అడ్వకేట్ , నరేందర్ పి ఈ టి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వంపై తిరుగుబాటు చేయాల్సిందే

### బీజేపీ యువ నాయకుడు పసుపుల ప్రశాంత్

**షాద్‌నగర్, అక్టోబర్ 05, ప్రభాతవార్త :** బస్సు ఛార్జీల పెంపు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని బీజేపీ యువ నాయకుడు పసుపుల ప్రశాంత్ తీవ్రంగా విమర్శించారు.ఒక వైపు ఆడవారికి ఫ్రీ బస్సు అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ, మరో వైపు అదే డబ్బును మగవాళ్లతో వసూలు చేయడం ప్రజలను మోసం చేయడమే. ఇది సూటిగా ఆడవాళ్ల ఫ్రీ పాస్ పేరు చెప్పి, మగవాళ్ల జేబులు ఖాళీ చేయడమే,అని ఆయన ఎద్దేవా చేశారు.మొన్న దసరా ఆఫర్ పేరుతో హైదరాబాద్ నుండి షాద్‌నగర్ వరకు 30 రూపాయలు పెంచి, ఇప్పుడు మళ్లీ ఛార్జీల పెంపు. ప్రజలు అడగని హామీలను ఇచ్చి వాటికోసం తిరిగి అదే ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. ఇలాంటి పాలన చూసి ప్రజలు నవ్వుతున్నారు, కాంగ్రెస్ పాలన అంటే ఇదేనని చెబుతున్నారు,అని ప్రశాంత్ వెటకారంగా వ్యాఖ్యానించారు.ప్రజల కోసం నడపాల్సిన బస్సులు ఇప్పుడు ప్రభుత్వ ఆదాయం కోసం వసూలు యంత్రాలుగా మారాయి. ప్రజా ప్రయోజనాల పేరుతో భారం మాత్రం సాధారణ మనిషి భుజాలపై వేస్తున్నారు,అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇంకా ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో ప్రజలు ప్రభుత్వంపై తిరుగుబాటు చేయాల్సిన పరిస్థితి వస్తుంది," అని ప్రశాంత్ హెచ్చరించారు.



ప్రశాంత్



భక్తులకు ప్రసాదం పొట్లాలను అందజేస్తున్న ఉత్సవ సమితి సభ్యులు.

## తుల్జాపూర్ వెళ్లే భక్తులకు అన్న ప్రసాదం

### -- హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు

**తాండూరు, అక్టోబరు 5, ప్రభాతవార్త :** తాండూరు నుండి తుల్జాపూర్‌లో వెలసిన భవాని మాతను దర్శించుకునేందుకు వెళ్తున్న భక్తులకు హిందూ ఉత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఉత్సవ సమితి ఆధ్వర్యంలో తుల్జాపూర్ వెళ్లే భక్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింలు ఆధ్వర్యంలో తాండూరు పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్దకు చేరుకొని భక్తులకు ప్రసాదం పొట్లాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి సభ్యులు పర్యాద రామకృష్ణ, మంతన్‌గౌడ్ అశోక్, మిర్చి వెంకట్, పరమేష్, కుమార్, కోట్ల రాజు, తాండ్ర నరేష్, లోకేష్, టైలర్ రమేష్ తదితరులు ఉన్నారు.

## లగచర్ల వాసికి సాహితీ కళా పురస్కారం..





సాహితీ పురస్కారం అందుకుంటున్న రమేశ్

**దుద్యాల్, అక్టోబర్ 05, ప్రభాతవార్త:** మండల పరిధిలోని లగచర్ల గ్రామానికి చెందిన ఈర్లపల్లి రమేష్ కు సాహితీ కళా పురస్కారం లభించింది. 2025 సంవత్సరానికి సంబంధించిన దసరా, బతుకమ్మ వేడుకల సందర్భంగా హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో వివిధ రకాల కళాకారులకు పురస్కారాలు అందించారు.

నిత్యశ్రీ యూట్యూబ్ ఛానల్ ద్వారా ఈర్లపల్లి రమేష్ సమాజానికి ఉపయోగపడే అంశాలతో కూడిన పాటల ు షార్ట్ ఫిల్మ్ ల ు రూపొందించి నిత్యశ్రీ యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రజలకు అందిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు వారికి జరుగుతున్న అన్యాయాల ు సొంతంగా రచించి వాటిని ప్రజలకు అర్థమయ్యే రీతిలో షార్ట్ ఫిల్మ్‌ల రూపంలో అందించి అందర్నీ ఆకట్టుకున్నాడు. ఆయన సేవల ు గుర్తించి సాహితీ కళా పురస్కారం అందించినట్లు నిర్వాహకులు స్వప్న కిషోర్ తెలిపారు. సాహితీ కళా పురస్కారంతో న న్ను గుర్తించడం చాలా సంతోషంగా ఉందని ఈర్లపల్లి రమేష్ ఆనందం వ్యక్తం చేశారు